
# బీసీ రిజర్వేషన్ల ప్రకటన చారిత్రాత్మకం

## టీబీసీయూఎస్ జిల్లా నేతలు సీతారామ్, శ్రీనివాసరావు హర్షం

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్





స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి టీబీసీయూఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంగర సీతారామ్, గజ్జెల్లి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యోగుల పక్షాన, ఉద్యోగస్థులకు కూడ రిజర్వేషన్లు కల్పిస్తూ త్వరగా ప్రకటన చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సగం జనాభాకు మించి ఉన్న బీసీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశం నిజంగా శుభవార్తను ప్రకటించిదని సీతారామ్, శ్రీనివాసరావు అభినందించారు. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపి బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందన్నారు. మార్చి నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ప్రభుత్వం ఆమోదించిందని వారు గుర్తు చేశారు. విద్యా ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ ప్రాతినిధ్యం కల్పించే రెండు బిల్లులను అదే రోజు అసెంబ్లీలో ఆమోదించింది మొదటిగా దేశంలోనే మొదటి వరుసలో నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు. మంత్రివర్గం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకుని సుదీర్ఘంగా బీసీల ప్రధాన డిమాండ్‌గా ఉన్న 42శాతం రిజర్వేషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టి జనాభాలో సగం మందికి పైగా ఉన్న బీసీల మనసు గెలుచుకున్నారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బీసీ డెడికేటేడ్ కమిషన్ను నియమించి, రాష్ట్ర ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో కులగణన చేపట్టి వీటి ఆధారంగానే అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించడం గొప్పవిషయమని అన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా, జనాభా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు తదుపరి చర్యలు చేపట్టాలని తీర్మానించి ఇందుకు సంబంధించి సమగ్ర విధానంతో రోడ్ మ్యాప్ తయారు చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. బీసీల రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీలకు మండలం యూనిట్‌గా, ఎంపీపీ, జడ్పీటీసీలకు జిల్లా యూనిట్‌గా, జడ్పీ చైర్మన్లకు రాష్ట్రం యూనిట్‌గా

పరిగణిస్తూ బీసీ రిజర్వేషన్ల పెంపునకు అనుగుణంగా రాష్ట్రంలో అమల్లో ఉన్న పంచాయతీరాజ్ చట్టం-2018 సవరణలకు మంత్రివర్గం ఆమోదం తెలిపి ఒక చారిత్రక నిర్ణయాన్ని ప్రకటించిందని సీతారామ్, శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. దీంతో పాటు కొత్తగా 22 వేల ఉద్యోగాలు భర్తీ చేసేలా నిర్ణయించడం గొప్పవిషయమని అన్నారు. ఈ ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసింది. వీటితో పాటు మరో 17,084 ఉద్యోగాల నియామక ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. కొత్తగా 22,033 ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వాలని మంత్రివర్గం చర్చించి నిరుద్యోగులకు ఒక ఆశను కలిగించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. దీంతో పాటు వివిధ విభాగాల్లో పని చేస్తున్న ప్రతీ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పనితీరును సమీక్షించేందుకు వీలుగా వారి ఆధార్, పూర్తి వివరాలు సేకరించాలని ఆర్థిక శాఖను మంత్రివర్గం ఆదేశించిందని గుర్తు చేశారు.